సాక్షి అనంతపురం

శుక్రవారం । 20 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టం రూ.16, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.7°/11.5°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదల నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఏపీ ప్రభుత్వ సలహాదారు (స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్) చల్లా మధుసూదన్‌రెడ్డి శుక్రవారం అనంతపురం రానున్నారు. అశోక్‌నగర్‌లోని యాపిల్ గార్డెన్స్‌లో జగనన్న కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కన్వీనర్లు, సారథులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొననున్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా స్త్రీ, పురుషుల సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్‌గౌడ్, కార్యదర్శి రాగిరి రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ట్రయిల్స్ నిర్వహిస్తామన్నారు. పురుషులు బరువు 85 కేజీలలోపు, స్త్రీలు 75 కేజీలలోపు ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు ఒరిజనల్ తీసుకురావాలని సూచించారు. మ్యాట్ షూ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 25 నుంచి 27 వరకూ విశాఖపట్టణం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి 70వ కబడ్డీ చాంపియన్స్‌షిప్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని వెల్లడించారు.

వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ

అనంతపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులకు వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ ఇస్తామని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సంబంధించి జేఎన్‌టీయూ ఆవరణలో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల భవనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డిప్లొమా విద్యార్థులకు సీఎన్‌సీ ప్రోగ్రామ్, బిల్డింగ్ ఆటోమేషన్‌పై శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సైతం కల్పించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 76589 02296 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మద్దతు ధరతో కందుల కొనుగోలు

అనంతపురం అర్బన్: మద్దతు ధరతో కంది కొనుగోలుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కంది కొనుగోలు అంశంపై జేసీ గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి జేడీఏ, మార్క్‌ఫెడ్ డీఎం, మార్కెటింగ్ ఏడీ, డీసీసీబీ అధికారి, ఏడీఏలు, ఆర్బీకే సిబ్బందితో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 56,978 హెక్టార్లలో రైతులు కంది పంట సాగు చేశారన్నారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉందన్నారు. ఎఫ్ఏక్యూ (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) ప్రకారం ఉన్న కంది పంటకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలు రూ.6 వేలుగా ప్రకటించిన నేపథ్యంలో కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఆర్బీకేలో సీఎం అప్లికేషన్ ద్వారా ఆర్బీకే అధికారి కంది రైతు వివరాలను నమోదు చేస్తారన్నారు. ఆ తరువాత మండలానికి ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రంలో రైతుకు చెందిన కంది పంట నమూనా పరీక్షించి ఎఫ్ఏక్యూ ప్రకారం ఉన్న వాటిని కొనుగోలు చేస్తారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ సూచించారు.

ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీగా విజయకుమార్



విజయకుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

అనంతపురం: ఆర్జీయూకేటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్–ఏపీ) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. దీంతో పాటు అదనంగా ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతలు చేపట్టాలని గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూజివీడు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం ఐఐఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. ఇందులో ఆరు సంవత్సరాల ఇంజినీరింగ్ కోర్సు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకు రెసిడెన్షియల్ శిక్షణతో పాటు నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను ప్రభుత్వమే అందిస్తుంది. ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం ఉద్యోగులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వసూల్ పక్కా..

- సోములదొడ్డికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల తొమ్మిదో తేదీన తన భూమికి సంబంధించిన ఆర్‌హెచ్ నకలు తీసుకోవడానికి అనంతపురం వచ్చారు. వాస్తవానికి దీని ఫీజు రూ.500. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది అతని నుంచి రూ.2వేలు వసూలు చేశారు. అడిగింది ఇవ్వకపోతే రేపు రా.. మర్నాడు రా.. అని తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.
- రెండ్రోజుల క్రితం అనంతపురం కోవూరునగర్‌కు చెందిన ఓ వ్యక్తి శివారు ప్రాంతంలో 20 సెంట్ల భూమి కొన్నాడు. మార్కెట్ విలువ ప్రకారం ఫీజు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలి. సైట్ చూడాలని రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్ అన్నారు. దీంతో రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచుతారేమోనని భయపడ్డ ఆ వ్యక్తి రూ.30 వేలు సమర్పించుకున్నాడు. దీంతో క్షేత్ర పరిశీలన లేకుండానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది.



- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దందా
- ఇవ్వకపోతే మార్కెట్ వ్యాల్యూ పెంచుతామని బెదిరింపు
- అడిగినంత సమర్పించుకుంటున్న క్రయవిక్రయదారులు
- మరోవైపు ఇష్టారాజ్యంగా స్టాంపులు విక్రయిస్తున్న వెండర్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాన్యులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళితే ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. బయటేమో స్టాంపు వెండర్లు రూ. వంద స్టాంపు పేపరును రూ.300 దాకా వసూలు చేస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళితే అక్కడా దోచుకుంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్లు, కిందిస్థాయి సిబ్బంది, డాక్యుమెంటు రైటర్లు మొత్తం కుమ్మక్కై, భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఓ సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయినా సరే.. భయపడే ప్రసక్తే లేదన్నట్టున్నారు.

అడిగింది ఇవ్వకపోతే సైట్ చూస్తాం..

ప్రతి ఏరియాలోని భూమికీ ప్రభుత్వం నిర్దిష్ట ధర నిర్ణయిస్తుంది. శివారు ప్రాంతాల్లో భూముల రేట్లు పెరిగాయి. కానీ రిజిస్ట్రేషన్ చార్జీలు పాతవే ఉన్నాయి. అలా ఎవరైనా శివారు ప్రాంత భూముల రిజిస్ట్రేషన్‌కు వస్తే సబ్‌రిజిస్ట్రార్లకు పండగే. ఇవ్వకపోతే 'సైట్ విజిట్' పేరుతో బెదిరిస్తున్నారు. సైట్‌కు వెళితే మార్కెట్ వ్యాల్యూ పెంచుతారని, దీనివల్ల రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ వ్యయం అవుతుందన్న భయంతో రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ సబ్ రిజిస్ట్రార్లకు క్రయవిక్రయదారులు ముట్టచెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అన్ని చోట్లా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అడిగింది ఇవ్వకపోతే ప్రతి డాక్యుమెంటులోనూ కొర్రీ వేసి ఆపేస్తారు.

డీఆర్‌ను బెదిరిస్తున్నారు

అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులే జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)ను బెదిరిస్తున్నారు. దీన్నిబట్టి అధికారుల బలహీనతలను సిబ్బంది సొమ్ముచేసుకుంటున్నారు. లేదంటే సెలవుపై వెళతామని.. లేదా మావాళ్లు ఫలానా సంఘంలో ఉన్నారని బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ అన్నిటికీ తల ఊపాల్సి వస్తోంది. ఇక స్టాంప్ వెండర్లయితే స్టాంపులను ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఆరోపణలపై విచారణ చేస్తున్నాం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆరోపణలు వచ్చిన మాట నిజమే. ఈ ఆరోపణలపై విచారణ చేస్తున్నాం. డీఆర్‌ను నివేదిక ఇవ్వాలని కోరాను. నివేదిక వస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– మాధవి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ

15 మందిపై నిషేధం



స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై తాజాగా విజిలెన్స్ తనిఖీలు నిర్వహించాం. ఇందులో 15 మంది అధీకృత విక్రయదారులు పక్కా ఆధారాలతో దొరికారు. వీరి నుంచి స్టాంపులు స్వాధీనం చేసుకుని, లైసెన్సు సీజ్ చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌కు రాశాం.

– వీరరాఘవరెడ్డి, విజిలెన్స్ డీఎస్పీ

పెరిగిన చేపల ఉత్పత్తి

- మంత్రి ఉష శ్రీచరణ్



కంబదూరు చెరువులోకి చేపలను వదులుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు : వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులన్నీ నిండాయని, ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉష శ్రీచరణ్ తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద 40 శాతం రాయితీపై 1,07,500 చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని గురువారం కంబదూరు చెరువులో మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మత్స్యకార భరోసా, మత్స్యకార పింఛన్ పథకాల వంటి అనే పథకాలను పార్టీలకతంగా అమలు చేసి ఆదుకుంటున్నారన్నారు. అంతకుముందు మత్స్యకారుల సంఘం నాయకులు మంత్రిని గజమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ శాంతి, ఎఫ్‌డీఓ లక్ష్మీనారాయణ, రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, వైస్ ఎంపీపీ భీమేష్, సర్పంచ్‌లు పద్మావతమ్మ, చంద్రశేఖర్ యాదవ్, యువజన నాయకులు సాకే గంగాధర్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, వైఎస్సార్‌సీపీ బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, కన్వీనర్ బాలరాజు, మత్యకారుల సంఘం నాయకులు భూషప్ప, నరసింహప్ప, పెద్దప్పయ్య పాల్గొన్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం అర్బన్: రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ఫక్కీరప్పతో కలిసి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి ప్రయాణంలో భద్రత పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే విషయాన్ని వారి తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రహదారి భద్రతలో నిర్లక్ష్యం కారణంగా ఒక ప్రాణం పోతే ఆ కుటుంబంపై ఎంతటి ప్రతికూల ప్రభావం చూపిస్తుందనే విషయాన్ని వాహనదారులకు వివరించాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలను చైతన్యపరచడం ప్రతి అధికారీ తనవంతు బాధ్యతగా భావించాలన్నారు.

గుడ్ సమరిటన్ అవార్డు

రహదారి ప్రమాదాలపై సత్వర సమాచారం అందించిన వారికి ఇచ్చే 'గుడ్ సమరిటన్' అవార్డును గణతంత్ర వేడుకల్లో ప్రదానం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఐరాడ్ వంటి యాప్‌ల ద్వారా అందే సమాచారం ఆధారంగా ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీటీసీ శివరామప్రసాద్, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్షన్ సెంటర్ల నిర్మాణాలకు సహకారం

శింగనమల: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకున్న రైతులకు కలెక్షన్ సెంటర్ల నిర్మాణాల కోసం 75 శాతం సబ్సిడీ అందిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శింగనమలలో నూతనంగా నిర్మించిన దొణరామేశ్వర స్వామి రైతు ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రం (కలెక్షన్ సెంటర్)ను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, ఆదాయం గురించి రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడి ముందుకు వస్తే లాభసాటి వ్యవసాయం చేసేందుకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. సంఘాల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీడీఓ నిర్మలాకుమారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఉమా శంకరమ్మ, బీకేఎస్ ఉద్యానశాఖాధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డ్రిప్ పరికరాలు

బుక్కరాయసముద్రం: అర్హులైన రైతులందరికీ సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం రోటరీపురంలో ఉద్యాన పంటల్లో డ్రిప్ వినిగియోగం, రైతు ఉత్పత్తి కేంద్రాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. డ్రిప్ ద్వారా తక్కువ నీటితో మొక్క జొన్న సాగు చేశానని, మంచి దిగుబడి వచ్చిందని మల్లేష్ అనే రైతు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తున్న రైతుల్లో అర్హులను గుర్తించి డ్రిప్ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ తేజోత్స్న, మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ, రైతులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యం అజరామరం

- ప్రజాకవి జయంతి అధికారికంగా నిర్వహించుకోవడం అదృష్టం
- రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వ కృషి : మంత్రి ఆర్కే రోజా
- సీఎం జగన్ నిర్ణయంపై అన్ని వర్గాల హర్షం: ఎమ్మెల్యే సిద్దారెడ్డి
- భవిష్యత్తు తరాలకు వేమన సందేశాన్ని పంచుదాం: ఎమ్మెల్యే శంకరనారాయణ
- కటారుపల్లిలో ఘనంగా యోగి వేమన జయంత్యుత్సవం



వేమన చిత్రపటం ఆవిష్కరిస్తున్న మంత్రి, చిత్రంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్, తదితరులు

గాండ్లపెంట: యోగివేమన తన పద్యాలతో పామరులను సైతం చైతన్యవంతం చేశారని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆయన సాహిత్యం నేటికీ అజరామరమని పేర్కొన్నారు. మండల పరిధిలోని కటారుపల్లిలో గురువారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగి వేమన జయంత్యుత్సవాల్లో మంత్రి రోజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేమన ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. సమాధిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి రోజా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. 17వ శతాబ్దంలో ఆయన రాసిన పద్యాలు నేటికీ జనం నోట నానుతుండడం గొప్ప విషయమన్నారు. తన సాహిత్యంతో సమాజాన్ని మేల్కొల్పిన వేమన ప్రజాకవి, సామాజిక విప్లవకారుడు, తాత్వికుడు అని కొనియాడారు. తెలుగు గడ్డపై అలాంటి మహనీయుడు జన్మించడం మన అదృష్టమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మాట్లాడుతూ యోగివేమన జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించడం ఇదే మొదటి సారన్నారు. తిమ్మమ్మ మర్రిమాను, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి రోజాను కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వేమన జయంతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాకవి పద్యాలను భవిష్యత్తు తరాలకు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వేమన చిత్రపటం, వేమన పద్య పుస్తకాలను, ఆంధ్రప్రదేశ్‌రెడ్డి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డిని, యోగి వేమన పీఠాధిపతులైన వైట్‌రెడ్డి,చెన్నారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, టూరిజంశాఖ, పోలీసు శాఖ అధికారులు, పాఠశాల హెచ్ఎం, ఎస్ఓలను దుశ్శాలువతో సన్మానించారు. మంత్రిని ఏపీ రెడ్డి సంఘం తరపున ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ బసంత్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, సర్పంచ్ గంగోజమ్మ, పర్యాటకశాఖ అధికారులు, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన పచ్చమూక



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, శంకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాష్టీకం
- ఇళ్లల్లోకి దూరి మారణాయుధాలతో దాడి
- పలువురికి తీవ్ర గాయాలు..

రాయదుర్గం రూరల్: మెచ్చిరి గ్రామంలో గురువారం పాత కక్షలు భగ్గుమన్నాయి. పచ్చ మూకలు రెచ్చిపోయాయి. అదును చూసి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాష్టీకం ప్రదర్శించాయి. ఇళ్లల్లోకి దూరి మహిళలు, చిన్న పిల్లలు అని విచక్షణ లేకుండా అందరిపైనా మారణాయుధాలతో దాడి చేశాయి. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ వర్గీయులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రతిదాడిలో టీడీపీ వర్గీయులకు కూడా గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రభుత్వ పోరంబోకు స్థలంలో వైఎస్సార్‌సీపీ వర్గీయుడు నామాల చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ మద్దతుదారుడైన యాదవ సామాజిక వర్గానికి చెందిన గొల్ల హనుమంతరెడ్డి వామి దొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. గత నెలలో ఇరువురి మధ్య స్థలంలో ఉన్న కళ్లి చెట్టు (పాల చెట్టు) విషయమై గొడవ జరిగింది. హనుమంతరెడ్డి అనవసరంగా గొడవకు పాల్పడినట్లు చంద్రశేఖర్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హనుమంతరెడ్డి, ఆయన కుమారులపై కేసు నమోదైంది. తమపై కేసు పెట్టారని ఆరోజు నుంచి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అండ చూసుకుని టీడీపీ వర్గీయులతో కలిసి గొల్ల హనుమంతరెడ్డి, అతని కుమారులు భీమయ్య, కిష్టప్ప, చిన్న రంగప్ప కుమారుడు శివణ్ణ, ఆంజనేయులు, శివరాజు, బసవరాజు, మారయ్య, తిప్పయ్య, మంజమ్మ, లక్ష్మి గురువారం పథకం ప్రకారం దాడికి పాల్పడ్డారు. కర్రలు, మచ్చుకత్తులు, గొడ్డళ్లతో చంద్రశేఖర్‌రెడ్డి, వారి బంధువర్గీయులపై విరుచుకుపడ్డారు. ఈ దాడిలో చంద్రశేఖర్‌రెడ్డి వర్గీయులైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రతిదాడిలో టీడీపీ వర్గీయులు గొల్ల హనుమంతరెడ్డి, భీమప్పతో పాటు మరికొంతమంది గాయపడ్డారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

ఘర్షణ నేపథ్యంలో రూరల్ సీఐ యుగంధర్ మెచ్చిరిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పాత కక్షల నేపథ్యంలోనే ఘర్షణ జరిగినట్లు సీఐ తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

- ఇదిలా ఉండగా పోలీస్ పికెట్ ఉన్నప్పటికీ గొల్ల హనుమంతరెడ్డి వర్గీయులు.. పోలీసులు అటు ఉండగా.. ఇటువైపు నుంచి చంద్రశేఖర్‌రెడ్డి వర్గీయుల ఇళ్లల్లోకి దూరి దాడి చేశారు. పిల్లలు, మహిళలు భయంతో వణికిపోయారు. పోలీసులు ఉన్నా రెచ్చిపోతున్నారని.. తమకు వారి నుంచి ప్రాణహాని ఉందని వాపోయారు.

జీవితాన్ని ఆర్పిన దీపం

- పూజ గదిలో దీపం అంటుకుని వృద్ధురాలి మృతి
- కుమారుడి ప్రయాణం సాఫీగా సాగాలని ప్రార్థించే సమయంలో ఘటన

అనంతపురం శ్రీకంఠంసర్కిల్ : కుమారుడి విదేశీయానం సురక్షితంగా సాగాలని తల్లి దేవుడిని వేడుకుంది. పూజగదిలో వెలిగించిన దీపం వద్ద కూర్చుని ప్రార్థిస్తున్న సమయంలో చీరకొంగు పక్కనే ఉన్న దీపంపై పడింది. కళ్లు మూసుకుని ఉండటంతో క్షణాల వ్యవధిలో మంటలు వ్యాపించాయి. గట్టిగా కేకలు వేసినా ఎవరికీ వినిపించకపోవడంతో తీవ్రంగా గాయపడి, మృతి చెందింది. ఈ ఘటన అనంతపురంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పక్కనే నివాసం ఉంటున్న చెన్నమ్మ (65) గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో బయట జన సంచారం లేదు. తర్వాత ఇంట్లోంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. స్థానికులు గుర్తించి పోలీసుల సహకారంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే చెన్నమ్మ మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. మంటలు ఆర్పిన స్థానికులు కొన ఊపిరితో ఉన్న చెన్నమ్మను 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే 50 శాతానికి పైగా కాలిపోయిన చెన్నమ్మ చికిత్స ప్రారంభించే సమయానికి మృతి చెందింది. దేవుడి ప్రార్థనలో ఉన్నపుడు చీరకొంగు దీపానికి తగిలి మంటలు వ్యాపించి ఉంటాయని నాల్గో పట్టణ పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. చెన్నమ్మ కుమారుడు విదేశాలకు వెళ్లేందుకని హైదరాబాద్‌కు బయల్దేరిన సమయంలో ఈ సంఘటన జరిగిందని తెలిపారు. మృతురాలి కుమారుడికి సమాచారం చేరవేసినట్లు వెల్లడించారు.

'గుంతకల్లు డివిజన్‌ను జోన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి'

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌ను రైల్వేజోన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని రైల్వే జోన్ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి కొత్త రైల్వేజోన్ ఇస్తామని ప్రకటించిన విషయం గుర్తుచేశారు. దక్షిణ మధ్య రైల్వేజోన్‌లో 7 డివిజన్లు ఉండగా అందులో గుంతకల్లు డివిజన్‌లో ఉన్న హుబ్లీని తొలగించి దాన్నే బెంగుళూరు స్థానంలో హుబ్లీ రైల్వేజోన్‌గా చేశారన్నారు. విభజన హామీని విస్మరించి తాజాగా వాల్తేరు డివిజన్‌ను జోన్‌గా చేస్తామనడం విచిత్రంగా ఉందన్నారు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో అన్నివిధాలుగా జోన్‌గా రూపాంతరం చెందడానికి గుంతకల్లు డివిజన్‌కు ఎక్కువ అస్కారం ఉందన్నారు. అలాగే తిరుపతి, హైదరాబాద్, బెంగూళూరుకు కొత్తగా డెమో రైళ్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ అంశాన్ని రైల్వే బోర్డు, జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డీఆర్‌ఎంను కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో సమితి నాయకులు కాశీరావు, జ్ఞానేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, మహబుబ్‌బాషా పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక రామిరెడ్డి కాలనీకి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి ఎ.కత్రేష్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... రామిరెడ్డి కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న కత్రేష్‌కుమార్ బుధవారం ఉదయం రైల్వే పెన్షనర్ల కార్యాలయానికి వెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి 7.30 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంటికి వేసిన తాళం బద్ధలుగొట్టి తెరిచి ఉండడం గమనించిన ఆయన ఆందోళనకు గురయ్యాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలోని 13 తులాల బంగారు నగలు, 2 తులాల వెండి, రూ.10వేల నగదు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఎస్పీని కలిసిన ఏఆర్ కన్వర్షన్ కానిస్టేబుళ్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా క్రమశిక్షణతో పని చేయాలని 2005 బ్యాచ్‌కు చెందిన ఏపీఎస్పీ 14వ బెటాలియన్ నుంచి ఏఆర్‌కు కన్వర్షన్ అయిన ఏడుగురు కానిస్టేబుళ్లకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప సూచించారు. గురువారం ఎస్పీని వారు ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత దారుణ హత్య

- ప్రేమ పెళ్లి.. సర్దుకుపోలేక విడాకులు
- మరొకరితో సన్నిహితంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక ఘాతుకం
- హతురాలి సోదరుడిపై కత్తితో దాడి
- పరిస్థితి విషమం


మృతురాలు ఆషాబీ


తీవ్రంగా గాయపడ్డ రమేష్

రాప్తాడురూరల్: ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్నాడు.. వారి ప్రేమకు గుర్తుగా ఓ కొడుకు పుట్టాడు. 15 ఏళ్ల వైవాహిక జీవితంలో మనస్పర్థలు తలెత్తడంతో సర్దుకుపోలేక విడాకులు తీసుకున్నాడు. మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక కిరాతకంగా హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరుకు చెందిన తపాల్ బాబా బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో 17 ఏళ్ల క్రితం గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన లక్ష్మిని ప్రేమించి, మతాంతర వివాహం చేసుకున్నాడు. పెళ్లి అనంతరం తన పేరును ఆషాబీగా ఆమె మార్చుకుంది. ఇద్దరూ కురుగుంట వైఎస్సార్ కాలనీలో ఉండేవారు. వీరికి నూర్ మహమ్మద్ వలి అనే కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాలుడి వయసు 15 సంవత్సరాలు.

అధికారికంగా తలాక్

కొన్నేళ్ల పాటు ఆషాబీ, బాబా జీవనం సాఫీగా సాగింది. అనంతరం బాబా శైలిలో మార్పు వచ్చింది. మద్యానికి బానిసయ్యాడు. తాగుడు అలవాటు మానేయాలని తరచూ భార్య చెబుతుండడంతో ఆమెతో ఘర్షణ పడేవాడు. బంధుమిత్రులు చెప్పినా మార్పు రాలేదు. దీంతో రెండేళ్ల క్రితం మసీదులో మత పెద్దల సమక్షంలో అధికారికంగా విడాకులు (తలాక్) తీసుకున్నారు. ఆ సమయంలో తన 13 ఏళ్ల కుమారుడిని పెద్దల మాటకు కట్టుబడి భర్త వద్దనే ఆమె వదిలేసింది. ఈ క్రమంలో అప్పుడప్పుడు తల్లి వద్దకు కుమారుడు వెళ్లి పలకరించి, తిరిగి తండ్రి వద్దకు చేరుకునేవాడు.

మరొకరితో వివాహం

తపాల్ బాబా నుంచి విడాకులు తీసుకున్నాక అక్కంపల్లికి చెందిన నబీరసూల్‌తో ఆషాబీకి పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే నబీరసూల్‌కు అప్పటికే వివాహమై భార్య కూడా ఉంది. ఆషాబీ రెండోభార్యగా కొనసాగుతూ వస్తోంది. ఇటీవల కురుగుంట జగనన్న కాలనీలో ఆషాబీకి ఇల్లు మంజూరు కావడంతో నబీరసూల్ దగ్గరుండి నిర్మాణం పూర్తి చేయించాడు. అనంతరం కొత్త ఇంట్లోనే వారు కాపురం ఉంటున్నారు.

కళ్లెదుటే తిరుగుతుంటే జీర్ణించుకోలేక

మాజీ భార్య ఆషాబీ తన కళ్లెదుటే మరో వ్యక్తిని పెళ్లి చేసుకుని సంతోషంగా తిరుగుతుండడాన్ని చూసి తపాల్ బాబా జీర్ణించుకోలేకపోయాడు. దీంతో ఆషాబీని హతమార్చేందుకు పథకం వేశాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుమారుడు వలితో కలసి ఆషాబీ ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. ఆ సమయంలో ఆషాబీ సోదరుడు రమేష్ వాకిలి తీయగానే బాబా ఒక్కసారిగా కత్తితో కడుపులో పొడవడంతో పేగులు బయట పడి అతను కుప్పకూలిపోయాడు. వెనువెంటనే బెడ్‌రూంలోకి వెళ్లి ఆషాబీపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఆమె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత కుమారుడితో కలసి పారిపోయాడు. అపస్మారస్థితిలో పడి ఉన్న రమేష్‌ను స్థానికులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. అయినా రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్, ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది కురుగుంట జగనన్న కాలనీకి చేరుకుని పరిశీలించారు. ఘటనపై చుట్టుపక్కల వారిని, ఆషాబీ బంధువులను ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సీఎంకు ఆహ్వానం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎల్‌ఎం ఉమామోహన్‌రెడ్డి దంపతులు

అనంతపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, ఎల్‌ఎం మోహన్‌రెడ్డి దంపతులు గురువారం కలిశారు. ఈ నెల 27న అనంతపురంలో జరగనున్న తమ కుమారుడు ఎల్‌ఎం గోవర్దనరెడ్డి వివాహ వేడుకకు హాజరు కావాలని ఆహ్వానించారు.

21 నుంచి అనంతలో 'విద్యాస్ఫూర్తి' ఎక్స్‌పో

అనంతపురం: ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో విద్యాస్ఫూర్తి మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్ అనంతరం ఎలాంటి కోర్సులు ఎంపిక చేసుకోవాలి. బెంగళూరులో అత్యుత్తమ ఇంజినీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ కళాశాలలు, యూనివర్సిటీలను ఎంపిక చేసుకునే అంశంపై ఏర్పాటు చేయనున్న ఎక్స్‌పోలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులూ పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఎక్స్‌పోలో పాల్గొనే వారికి బహుమతుల ప్రదానం ఉంటుంది. పూర్తి వివరాలకు 78291 85383, 98458 16919లో సంప్రదించవచ్చు.

ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు కుళ్లాయప్ప

కణేకల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం మాల్యం నివాసి కుళ్లాయప్ప (45) బుధవారం పొలం ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. గ్రామ శివారున పెట్రోల్ బంక్ వద్ద సమీపంలో వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన కుళ్లాయప్పను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లు రూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను గుంతకల్లు సెబ్ సీఐ మహేష్‌కుమార్ వెల్లడించారు. కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామానికి చెందిన చిన్నపెద్దయ్య గురువారం మధ్యాహ్నం 8 బాక్సుల్లో 768 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

22 నుంచి సీకే నాయుడు క్రికెట్ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీ మరో సారి అనంత వేదికగా జరగనుంది. ఇందుకు అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన క్రికెట్ మైదానాన్ని నిర్వాహకులు సిద్ధం చేశారు. అనంత వేదికగా బీసీసీఐ నేతృత్వంలో మూడోసారి మ్యాచుల నిర్వహణ చేపట్టడం గమనార్హం. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ నెల 22 నుంచి టోర్నీ నిర్వహించనున్నారు. తొలి మూడు రోజులు ఆంధ్ర, గుజరాత్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. అనంతరం 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ ఆంధ్ర, బీహార్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించనున్నారు. గురువారం సాయంత్రం ఆంధ్ర, గుజరాత్ క్రికెట్ జట్లు అనంత క్రీడా మైదానానికి చేరుకున్నాయి. శుక్రవారం నుంచి ప్రాక్టీస్ సెషన్‌లో ఆయా జట్లు పాల్గొననున్నాయి. మ్యాచ్ రెఫరీగా సునీల్ చతుర్వేది, అంపైర్లుగా నిఖిల్ మినన్, సుబ్రహ్మణ్యం అయ్యర్, స్కోరర్లుగా తోట విజయ్, చైతన్య, వీడియో అనాలసిస్ట్‌గా ఎస్‌ఏ రహిమాన్, అశోక్ వ్యవహరించనున్నారు.

భూముల రీసర్వే త్వరితగతిన పూర్తి చేయండి


కొప్పలకొండలో భూముల రీసర్వే పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

గార్లదిన్నె: గ్రామాల్లో భూముల రీసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందిని ఆర్డీఓ మధుసూదన్ ఆదేశించారు. గార్లదిన్నె మండలం కృష్ణాపురం, కొప్పలకొండ, కల్లూరు అగ్రహారం గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. భూముల రీసర్వేకు సంబంధించి సంబంధిత రైతులకు ముందస్తుగా నోటీసులు అందజేసి సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సచివాలయం సర్వేయర్, వీఆర్వోలు రోజూ ఉదయం 7 గంటలకు సర్వే ప్రక్రియలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సర్వే, ల్యాండ్ రికార్డు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకట చెన్నయ్య, తహసీల్దార్ ఉషారాణి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్, మండల సర్వేయర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీపై ఆందోళన వద్దు

- పెన్షనర్లకు ఖజానా శాఖ డీడీ భరోసా


ఖజానా శాఖ డీడీకి సమస్య వివరిస్తున్న పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జయరామప్ప

అనంతపురం అర్బన్: ఈ–కేవైసీ అనుసంధానం గురించి పెన్షనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరళా విజయకుమారి భరోసా ఇచ్చారు. ఈ–కేవైసీ అనుసంధానానికి ఈ నెల 20 చివరి తేదీ కాదని స్పష్టం చేశారు. ఈ అంశంపై పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప గురువారం డీడీని ఆమె చాంబర్‌లో కలిశారు. డీడీ సానుకూలంగా స్పందిస్తూ ఎస్టీఓ కార్యాలయానికి వెళ్లి ఈ–కేవైసీ అనుసంధానంలో వస్తున్న సమస్యలను తెలుసుకుని, శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ–కేవైసీపై నిర్ణయం, విధి విధానాల మార్గదర్శకాలు శుక్రవారంలోపు తెలియజేస్తామని డైరెక్టర్ తెలిపారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు ప్రస్తుతం ఈ–కేవైసీ అనుసంధానం జరుగుతోందన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ తరహాలోనూ హెచ్‌ఈఆర్‌బీ–ఈకేవైసీ అనుసంధానం కూడా తీసుకొచ్చే ప్రయత్రం జరుగుతోందన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ మాదిరిగానే మొబైల్‌తో పాటు ఎస్టీఓ దగ్గర కూడా ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. పెన్షన్ చెల్లింపునకు ఈ–కేవైసీతో సంబంధం లేదని, పెన్షనర్లు అనవసర ఆందోళన చెందవద్దని డీడీ సూచించారు.

డీఎస్సీ పోస్టుల్లోనూ వర్క్ అడ్జెస్ట్‌మెంట్

అనంతపురం: స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం నేరుగా, తక్కిన 30 శాతం డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. తాజాగా 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రతి సబ్జెక్టుకూ స్కూల్ అసిస్టెంట్ ఉండాలని నిర్ణయించిన నేపథ్యంలో ఏ ఒక్క పోస్టు ఖాళీ ఉండకూడదని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు 30 శాతం పోస్టుల్లోనూ వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. ఇందుకు సంబంధించి గురువారం ఉపాధ్యాయ భవన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 56 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులకు 116 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 16 మంది మాత్రమే ఆమోదం తెలిపారు. మేథమేటిక్స్ 20 పోస్టులకు గాను 40 మందిలో ఐదుగురు ఆమోదం తెలపగా, సోషియల్ స్టడీస్‌కు ఐదు పోస్టులకు గాను 10 మందిని పిలవగా ఎవరూ అంగీకారం తెలపలేదు. డీఎస్సీ ప్రకటన వెలువడి ఉద్యోగాలు భర్తీ అయ్యే వరకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ నిమిత్తం తాజాగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ హత్య కుట్ర భగ్నం

- పన్నాగం పన్నిన భార్య
- సహకరించేందుకు అంగీకరించిన స్వామిజీ
- నిందితుల అరెస్ట్


నిజాముద్దీన్‌తో ప్రకాష్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఏఆర్ మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ హత్య కుట్ర భగ్నమైంది. గుప్తనిధుల తవ్వకాల కేసులో నల్లమాడ పోలీసులకు పట్టుబడిన నిందితులు.. విచారణలో ప్రకాష్ హత్యకు పన్నిన కుట్రను బహిర్గతమైంది. దీంతో తదుపరి విచారణ నిమిత్తం కేసును శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అనంత పోలీసులకు బదలాయించారు. దీంతో గురువారం నిందితులను అనంతపురం రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. ప్రకాష్ హత్యకు కుట్ర పన్నిన వైనాన్ని సీఐ శివరాముడు వెల్లడించారు. ప్రకాష్, నాగమణి దంపతులు. చాలా కాలంగా ప్రకాష్ మరో మహిళతోసన్నిహితంగా ఉంటూ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని భార్య అనుమానాలు పెంచుకుంది. కుటుంబ అవసరాలు, పిల్లల బాగోగులు చూడకుండా తన సుఖం తాను చూసుకుంటున్నాడని మదనపడిన నాగమణి భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని భావించింది. ఈ క్రమంలో ఆ కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉన్న స్వామిజీ నిజాముద్దీన్‌ను సంప్రదించింది. క్షుద్ర పూజలు చేసి తన భర్త ఆరోగ్యం క్షీణించేలా చేయాలని కోరింది. ఇందుకు సమ్మతించిన స్వామిజీ పక్కా ప్రణాళికతో పూజకు రంగం సిద్ధం చేశాడు. ప్రకాష్ ఇంట్లోనే రెండు రోజుల పాటు ఉన్న అతను... పూజకు అవసరమైన విషయాలను ప్రకాష్ భార్యతో చర్చించాడు. ఈ నేపథ్యంలోనే నల్లమాడ మండలంలో గుప్తనిధుల వెలికి తీతకు సంబంధించి ఒప్పందం ఉడడంతో ఆ పని పూర్తి చేసుకుని వస్తానని చెప్పి స్వామిజీ వెళ్లాడు. ఈ లోపు నాటకీయ పరిణామాల మధ్య గుప్తనిధుల వేటగాళ్లు అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో స్వామి గుట్టు పోలీసుల విచారణలో రట్టయింది. కేసులో ప్రకాష్ భార్య నాగమణితో పాటు నిజాముద్దీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు.

బాలికలో మెడలో పసుపుతాడు!

ఉరవకొండ: ప్రేమ పేరుతో ఓ బాలికలను యువకుడు వంచించగా, గ్రామ పెద్దలు పంచాయితీ చేశారు. ఆ బాలిక మెడలో పసుపుతాడు కట్టించారు. ఈ పెళ్లి తంతుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు దృష్టిసారించారు. వివరాల్లోకి వెళితే... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో 8వ తరగతి చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమపేరుతో వంచించాడు. తరచూ బాలిక ఇంటివద్దకు వెళ్తుండటంతో బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఈ నెల 18న పంచాయితీ చేశారు. బాలిక ఇంటి ముందు యువకుడి చేత తూతూ మంత్రంగా పసుపుతాడు కట్టించారు. ''మీకు పెళ్లయిపోయింది.. పోండి' అంటూ వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

స్పందించిన అధికారులు : బాలిక మెడలో పసుపుతాడు కడుతున్న యువకుడి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి స్పందించారు. ఉరవకొండ రూరల్ సూపర్‌వైజర్ తిరుపాల్ భాయిని ఆమిద్యాలకు పంపగా...ఆమె బాలికను విచారించారు. బాలికను చైల్డ్ హోంకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, 8వతరగతి చదివే బాలిక పెళ్లి చెల్లుబాటు కాదన్నారు. బాలికలను కేజీబీవీ పాఠశాలలో ఉంచి మేజర్ అయ్యే వరకూ చదివిస్తామన్నారు. మరోవైపు పోలీసులూ ఈ ఘటనపై స్పందించారు. బాలిక మెడలో పసుపుతాడు కట్టిన యువకుడితో పాటు అందుకు ప్రోత్సహించిన గ్రామపెద్దలను పోలీసు స్టేషన్‌కు పిలిపించినట్లు తెలుస్తోంది.

24న బీఫార్మసీ, ఫార్మాడీ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)లో కన్వీనర్ కోటాలో బీ.ఫార్మసీ, ఫార్మాడీ సీట్లు భర్తీ కాగా మిగిలిన సీట్లకు ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డి గురువారం వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అనర్హులుగా ఉంటారన్నారు. జేఎన్‌టీయూ (ఏ) పాలకభవనంలో జరిగే స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ రోజునే ప్రాసెసింగ్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎన్‌హెచ్‌ఎం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల క్యాలెండర్లను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి ఆవిష్కరించారు. గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉద్యోగుల బాధ్యత చాలా కీలకమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు, ఏఓ ప్రభాకర్ మోజెస్, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ గౌరవాధ్యక్షులు శ్రీధర్‌బాబు, అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులపై భారం తగ్గించాలి

అనంతపురం అర్బన్: విద్యుత్ వినియోగదారులపై భారం తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కార్యదర్శిని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విన్నవించారు. ఈమేరకు ఆయనకు లేఖ రాసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా టారిఫ్ పెంపు, స్లాబు మార్పిడి, ఫిక్స్‌డ్ చార్జీలు, అదనపు డిపాజిట్లు, తదితర రూపాల్లో వినియోదారులపై భారం వేశారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గినందున చార్జీలు తగ్గించాలన్నారు. 50 యూనిట్ల వరక కనీస స్లాబు పునరుద్దరించాలని, నివాసాలకు ఫిక్స్‌డ్ చార్జీలు రద్దు చేయాలని కోరారు. ప్రాంతంలో నిమిత్తం లేకుండా అర్హులైన ఎస్సీ, ఎస్టీ తరగతులకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నారు.

రాయలసీమ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులతో చర్చి పాస్టర్లు

అనంతపురం కల్చరల్ : రాయలసీమ ఫెలోషిప్ నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటైంది. స్థానిక హౌసింగుబోర్డులోని ఏటీఎఫ్ ప్రార్థనామందిరంలో జరిగిన సమావేశంలో కమిటీ అధ్యక్షునిగా పాస్టర్లు మోజెస్, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్, సెక్రటరీగా సీహెచ్ దాస్, జాయింట్ సెక్రటరీగా గంగాధర్, ఈసీ సభ్యులుగా లక్ష్మీనారాయణ, ఆంథోని, మాణిక్యరాజు తదితరులను నూతన కార్యవర్గంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రాయలసీమ ఫెలోషిప్ ప్రతినిధి రెవరెండ్ ఎస్‌కే కృపాదాస్, ఈటీ స్వామిదాసు తదితరులు మాట్లాడారు. రాయలసీమ ఫెలోషిప్ చేస్తుందన్నారు. అంతకు ముందు సామూహిక ప్రార్థనలు జరిగాయి.

విద్యుత్, నీరు పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

అనంతపురం సప్తగిరి సర్కిల్: విద్యుత్, నీరు పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ తెలిపారు. శక్తి వనరుల వినియోగం పై స్థానిక వైద్యకళాశాలలోని సెంట్రల్ హాల్‌లో వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శక్తి వనరులైన విద్యుత్, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అతిగా వాడుకోవడం ద్వారా విద్యుత్ కొరత, నీటి కొరత ఏర్పడుతుందన్నారు. మండలి సీఈఓగా దేవకుమార్, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యకుమార్ ఆదేశాల మేరకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 21న వైద్య విద్యార్థులకు శక్తి వనరుల పొదుపుపై ప్రత్యేకంగా పోటీలు నిర్వహించి, బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ షారోన్ సోనియా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి న్యాయం చేయండి

అనంతపురం రూరల్: పంచాయతీ కార్యదర్శి వేధింపులతో మృతి చెందిన బిల్‌కలెక్టర్ నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డీఎల్‌పీఓను కోరారు. గురువారం డీపీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ సుమన జయంతికి వినతి పత్రం అందజేశారు.

అర్హులకు పథకాలు వర్తింపజేయండి

- సచివాలయ సిబ్బందిని ఆదేశించిన ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: పేదలందరికీ పథకాలు వర్తింపజేయాలని, ఏదైనా సాంకేతిక కారణాలతో పథకాల్లో జాప్యమైనా దృష్టి సారించి మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. గురువారం 41వ డివిజన్ హనుమాన్ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గోగుల లక్ష్మీదేవితో కలిసి మూడేళ్ల వైఎస్ జగన్ సర్కార్‌లో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయానని ఓపిగ్గా లబ్ధిదారులతో మాట్లాడారు. డివిజన్‌లో పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే స్థానికులకు తెలియజేశారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు లక్ష్మమ్మ, పుష్పలత, కాలికి శస్త్రచికిత్స చేసి, ప్లేట్ వేశారని, దాన్ని తొలగించేందుకు సాయమందించాలని శ్రీహర్ష అనే యువకుడు ఎమ్మెల్యేను కోరాడు. అమ్మఒడి డబ్బులతో మా ఇద్దరు బిడ్డలను బాగా చదివిస్తున్నామని చంద్రకళ అనే మహిళ ఎమ్మెల్యేతో ఆనందాన్ని పంచుకుంది. పాఠశాల, కళాశాలలో హాజరుశాతం 80 శాతం ఉంటేనే అమ్మఒడి పథకం వర్తిస్తుందని, పిల్లలను రోజూ తప్పక స్కూళ్లకు పంపాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి లబ్దిదారులకు సూచించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డైరెక్టర్లు గౌస్‌బేగ్, గోయిందు, శ్రీనివాసులు, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, శ్రీనివాసులు, మునిశేఖర్, చంద్రమోహన్ రెడ్డి, దుర్గాదేవి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణవేణి, భారతి, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలువర్తింపజేస్తూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని నేతాజీ నగర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాల అములును ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అనంతపురం నగరానికి దీటుగా నియోజవర్గ పరిధిలోని పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు.

టీడీపీ హయాంలో వర్గపోరుతో కాలం గడిపారు : గత ప్రభుత్వ హయాంలో రాజీవ్‌కాలనీ పంచాయతీని దత్తతకు తీసుకున్నామని చెప్పిన ప్రభాకర్ చౌదరి.. ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ హయాంలో వర్గపోరుతో కాలం గడిపారన్నారు. నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంటే ప్రభాకర్ చౌదరి మాత్రం తన ఉనికి కోసం కుటిల రాజకీయాలకు తెరలేపారన్నారు. విన్సెంట్ ఫెర్రర్ విగ్రహ ఏర్పాటు విషయాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. ఫెర్రర్ కుటుంబ సభ్యులు, జిల్లా కలెక్టర్‌తో చర్చించి విగ్రహ ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, రహీమ్, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కృష్ణవేణి, అనిల్‌కుమార్‌గౌడ్, పసులూరి ఓబిలేసు, అంజి, కరీమ్, దౌలా తదితరులు పాల్గొన్నారు.

నేడు 42వ డివిజన్‌లో... : నగరంలోని 42వ డివిజన్‌లోని 6వ రోడ్డు నుంచి ఉదయం 6:30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏ కష్టమొచ్చినా నాతో చెప్పండి



గంగలకుంటలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: 'అమ్మా నేను మీ బిడ్డను ...మీకు ఏ సమస్యలున్నా నాతో చెప్పండి.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తా..' అంటూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వృద్ధులు, మహిళలు, గ్రామస్తులకు భరోసా కల్పించారు. గురువారం రాప్తాడు పంచాయతీలోని గంగలకుంటలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డితో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు.

టీడీపీ హయాంలో ప్రజలకేం చేశారు?: ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల కంటే ప్రజలకు ఎక్కువ మేలు చేకూర్చి రాష్ట్రాన్ని వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడుపుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. 2014–19 కాలంలో ప్రజలకేం చేశారో టీడీపీ నాయకులు చెప్పాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందేవన్నారు.

గంగలకుంట చెరువుకు నీళ్లిచ్చాం: 2017 డిసెంబర్ 13న రాప్తాడులో జరిగిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గంగలకుంట చెరువుకు నీరిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 2014లో ఎన్నికల్లోనూ తనను గెలిపిస్తే గంగలకుంట చెరువును నీటితో నింపుతానంటూ పరిటాల సునీత చెప్పి గెలిచిన తర్వాత మాట తప్పి తమ నైజాన్ని ప్రకటించడంతో 2019 ఎన్నికల్లో తమ కుమారుడు పరిటాల శ్రీరామ్‌ను చిత్తుగా ఓడించడం జరిగిందన్నారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి పీఏబీఆర్ ధర్మవరం కుడికాలువ నుంచి గంగలకుంట చెరువు వరకు దాదాపు 4 కిలో మీటర్ల మేర రూ.2 కోట్లు సొంత నిధులు వెచ్చించి, సప్లయ్ చానల్ ఏర్పాటు చేసి, అధికారంలోకొచ్చిన 18 నెలల్లోనే నీరు అందించామన్నారు. ఏటా గంగలకుంట చెరువుకు సాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, ఎస్సీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, ఆకుతోటపల్లి సర్పంచు చిట్రా గురుప్రసాద్, స్థానిక నాయకులు చిట్రా వెంకటరాముడు, చిట్రా వెంకటేష్, కపాడం ఈశ్వరయ్య, డీలర్ రామలింగమయ్య, సాకే చంద్ర, జయన్న పాల్గొన్నారు.

మీ అభిమానానికి రుణపడి ఉంటాం



గ్రామోత్సవానికి వచ్చిన వారికి ధన్యవాదాలు తెలుపుతున్న తోపుదుర్తి గ్రామస్తులు

ఆత్మకూరు: మాపై ఉన్న మీ అభిమానానికి రుణపడి ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. ఈ నెల 18న తోపుదుర్తి గ్రామంలో జరిగిన గ్రామోత్సవానికి ఎమ్మెల్యే, తోపుదుర్తి కుటుంబ సభ్యుల పిలుపు మేరకు వేలాదిగా తరలి వచ్చారు. గురువారం పెద్దమ్మ ఆలయం వద్ద తోపుదుర్తి గ్రామస్తులు, గ్రామపెద్దలు కలసి గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి , తోపుదుర్తి చందు, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 140 ఏళ్ల తర్వాత జరిగిన ఊరుదేవరకు కులమత, పార్టీలతో సంబంధం లేకుండా పాల్గొన్నందుకు ఆనందంగా ఉందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా గ్రామోత్సవంలో పాల్గొన్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు సమస్యలు రాకుండా చేసిన పోలీసు సిబ్బందికి , అపరిశుభ్రత లేకుండా పరిశుభ్రంగా ఉంచిన పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేష, ఎంపీటీసీ పోతులయ్య, గ్రామ పెద్దలు పెద్దిరెడ్డి, మల్లే అక్కులప్ప, కుమార్‌రెడ్డి, పెదయ్య, మల్లికార్జున, చెన్నప్ప, పోతులయ్య, ఫక్కీరప్ప, లక్ష్మన్న, జి.ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యం సజీవం



యోగివేమనకు నివాళులర్పిస్తున్న మేయర్ వసీం సలీం



మెమొంటోను అందిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి

అనంతపురం: సామాజిక రుగ్మతలను రూపుమాపేలా వేమన సాహిత్యం ఉంటుందని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. గురువారం ఎస్కేయూలో విశ్వకవి యోగివేమన జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాటి సామాజిక దురాచారాలను రూపుమాపడానికి యోగివేమన రచనలు అభ్యుదయంగా నిలిచాయన్నారు. ప్రధాన వక్తగా ప్రొఫెసర్ గురివిరెడ్డి గారి శివారెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు చీకట్లను పారద్రోలే వెలుగు లాంటివన్నారు. కార్యక్రమంలో రెక్టార్ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం. రామచంద్ర, సోమశేఖర్, సదస్సు కోకన్వీనర్ డాక్టర్ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాష బతికి ఉన్నంత కాలం వేమన పద్యాలు నిలిచి ఉంటాయని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనంలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్డీటూ వీసీ దేవన్న, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవానీ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో వేమన జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిటిల్‌ఫ్లవర్ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పూజారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో యోగివేమన జయంతిని గురువారం నిర్వహించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ కే భాగ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు ఇస్సాక్, శ్రీనివాసులు, సైపుల్లాబేగ్ పాల్గొన్నారు.

వేమన పద్యాలు చిరస్మరణీయం

= విశ్రాంతి వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి

అనంతపురం కల్చరల్: ప్రజాకవి యోగి వేమన పద్యాలు చిరస్మరణీయమని విశ్రాంత వైస్ చాన్సలర్ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి గురువారం ఘనంగా జరిగింది. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రభాకరరాజు అధ్యక్షత వహించారు. డాక్టర్ కాడా రామకృష్ణారెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్‌రెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలమ్మ, సామాజిక సేవా కార్యకర్త కేవీ రమణ, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డాక్టర్ నగరూరు రసూల్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వేమన ఫౌండేషన్ కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి , కవులు, రచయితలు నబీరసూల్, మధురశ్రీ, ఎల్కేపి అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పాణ్యం సుబ్రమణ్యం, అశ్వర్థ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన యువజన వారోత్సవాలు : స్థానిక మాస్టర్ మైండ్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌వైకే, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగిన యువజనోత్సవాల ముగింపు కార్యక్రమానికి నెహ్రూయువకేంద్ర డీడీవో శ్రీనివాసులు, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీ, సుంకర రమేష్ తదితరులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రమేష్, బసవయ్య, దివ్యతేజ, కిరణ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వేమన గొప్ప సంఘ సంస్కర్త

అనంతపురం అర్బన్/అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రజాకవి యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కొనియాడారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో యోగి వేమన జయంతి నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ గాయత్రీదేవి హాజరై వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ దేశంలోని తత్వవేత్తల్లో యోగి వేమన అగ్రగణ్యులన్నారు. 'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మాటను విననిి తెలుగువారు ఉండరన్నారు. వానకు తడవని వారు... ఒక్క వేమన పద్యమూ రాని తెలుగు వారు ఉండరని లోకోక్తి



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అన్నారు. 30 వేల తెలుగు పద్యాలు రచించారని, ఆయన పద్యాలు తెలుగు సాహిత్య వనంలో విరబూసిన రత్నాల హారాలని కీర్తించారు. యోగి వేమనకు నివాళిగా కేంద్ర ప్రభుత్వం 1972లో పోస్టల్ స్టాంపు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో ఆన్‌సెట్ మేనేజర్ సునీల్‌కుమార్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయలక్ష్మి, యువజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కె.మూర్తి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో.. ప్రజాకవి యోగి వేమన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో వేమన చిత్రపటానికి అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శివరాముడు, ఆర్ ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తం, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించాలి

అనంతపురం క్రైం: ఇంటి, నీటి పన్ను చెల్లింపులు వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాంనగర్ 53వ సచివాలయ పరిధిలో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌ను అదనపు కమిషనర్ పరిశీలించారు. సచివాలయ అడ్మిన్ పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ఆత్మకూరు: గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు దయాకర్, సబీహా సుల్తానా తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించారు. వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు, ఆకుకూరలు, పాలు, గుడ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే సంపూర్ణ ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం రక్త శాత పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేశ్వరయ్య, చంద్రావతి, తులశమ్మ, వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో భూ సమస్యలకు చెక్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం

- సర్వేను ప్రారంభించిన మేయర్ వసీం

అనంతపురం క్రైం: డ్రోన్‌సర్వేతో భూ సమస్యలు, వివాదాలకు చెక్ పడుతుందని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన డ్రోన్ సర్వేను మేయర్ వసీం పూజ చేసి ప్రారంభించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, కమిషర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడున్నరేళ్లలో పాలనాపరంగా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. స్థిరాస్తి యజమానుకుల అండగా నిలిచేందుకు వందేళ్ల తర్వాత డ్రోన్ సర్వేను చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.రీ సర్వేలో భాగంగా నగరంలోని 50 డివిజన్ల పరిధిలోని 16.46 కిలోమీటర్లలోని 4,306 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. నిర్భయంగా భూమి సాగు, స్థలాలకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యాధునిక పరిజ్ఞానంతో భూమి కొలతల్లో కచ్చితమైన విలువ తెచ్చేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రోవర్ తదితర పరికరాలతో నగరపాలక సంస్థ పరిధిలో సర్వే చేసినట్లు తెలిపారు. డ్రోన్ సర్వేతో ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ) వస్తుందన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో మరోసారి భూమి కొలతలను పరిశీలించి, సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇస్సాక్, శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, చంద్రమోహన్ రెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఏసీపీలు శ్రీనివాసులు, సువర్ణ, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ కిశోర్‌బాబు, సర్వేయర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ బ్రిడ్జితో ఒరిగేదేమీలేదు

- రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: ఐకానిక్ బ్రిడ్జ్ వద్దు.. రోడ్డుతో కూడిన బ్యారేజిని నిర్మించాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2022లో హైదరాబాద్–కల్వకుర్తి, కల్వకుర్తి–నాగర్‌కర్నూల్–కొల్లాపూర్–సిద్దేశ్వరం వద్ద ఐకాన్ బ్రిడ్జ్ నిర్మాణానికి అన్ని రకాల అనుమతి ఇచ్చిందన్నారు. దీనివల్ల రాయలసీమ ప్రాంతానికి ఒరిగేదేమిలేదన్నారు. ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం బదులుగా అదే ప్రాంతాల్లో రోడ్డుతో కూడిన బ్యారేజి నిర్మిస్తే తెలంగాణ ప్రాంతానికి కూడా సాగు నీరు అందుతుందన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న 'చలో సిద్దేశ్వరం' చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు అశోక్ వర్ధన్, సీమకృష్ణ, ప్రముఖ రచయితలు బండి నారాయణస్వామి, శాంతినారాయణ, రవికుమార్, శేషామూర్తి, సుంకన్న, నాగార్జున, మణిరత్నం, రామన్న తదితరులు పాల్గొన్నారు.

అనంత వాసులకు రాష్ట్రస్థాయి గుర్తింపు

అనంతపురం కల్చరల్: భీమవరానికి చెందిన డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లావాసులు ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయిలో గుర్తింపుపొందినట్లు నిర్వాహకులు త్సవటపల్లి మురళీకృష్ణ , దాయని చంద్రాజీ గురువారం తెలియజేశారు. డాక్టర్ ఉమర్ అలీషా రచించిన 'విషాద సౌందర్యం' నాటకంపై జరిగిన పోటీల్లో నగరానికి చెందిన కురుబ దివ్యతేజ ద్వితీయ స్థానం, కరణం హరికిశోర్ ప్రత్యేక ప్రశంస పొందారు. వీరు ఈనెల 23న భీమవరంలో జరగనున్న సాహితీ పురస్కార ప్రదానోత్సవంలో శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ అలీషా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకుంటారు.

నగరపాలక సంస్థ ఉద్యోగి ఆకస్మిక మృతి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగిని మాబున్ని(45) గురువారం కర్నూలులో ఆకస్మికంగా మృతిచెందింది. మాబున్నీ పన్ను చెల్లింపు కేంద్రంలో క్యాషియర్‌గా సేవలందించేది. విషయం తెలుసుకున్న మేయర్ వసీం, అదనపు కమిషనర్ రమణారెడ్డి, తదితర నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు స్థానిక సాయినగర్‌లోని మృతురాలి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.



మాబున్నీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కమిషనర్

శబరిమల యాత్రలో ప్రయాణికుడి టోకరా

రాప్తాడురూరల్: శబరిమల దర్శనానికి వెళ్లే సమయంలో అయ్యప్ప భక్తుడి మొబైల్ నుంచి బస్సు డ్రైవర్ రూ.25 వేలు తన స్నేహితుడి ఫోన్‌పే అకౌంట్‌కు పంపిన విషయాన్ని గుర్తించి బాధితుడు అనంతపురం రూరల్ పోలీసులను గురువారం ఆశ్రయించాడు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌కు చెందిన దివాకర్ అయ్యప్పస్వామి మాల ధరించాడు. ఈనెల 2న టూరిస్ట్ బస్సులో 45 మంది ప్రయాణికులతో శబరిమల యాత్రకు వెళ్లాడు. బస్సు క్యాబిన్‌లో దివాకర్ చార్జింగ్ పెట్టాడు. ఈనెల 11న తిరుగు ప్రయాణంలో మధురై సమీపంలో దివాకర్‌తో కలిసి డ్రైవర్ వెంకయ్య టీ తాగారు. దివాకర్ డబ్బులు ఫోన్ చేసే క్రమంలో యూపీఐ పిన్ నంబర్ ఎంటర్ చేస్తుండగా, డ్రైవర్ గుర్తుపెట్టుకున్నాడు. బస్సు క్యాబిన్‌లో దివాకర్ తన మొబైల్‌ను చార్జింగ్ పెట్టి నిద్రిస్తుండగా, డ్రైవర్ వెంటనే దివాకర్ మొబైల్ తీసుకొని రూ. 25 వేలు తన స్నేహితుడి మొబైల్‌కు పంపాడు. వచ్చిన మెసేజ్‌లను డిలీట్ చేశాడు. ఈ విషయాన్ని గమనించిన బాధితుడు అనంతపురం రూరల్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నబీరసూల్ మాట్లాడుతూ డ్రైవరు వెంకయ్యపై చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేస్తామని తెలిపారు.